## స్వామీజీ ఉత్తరము—

దర్బార్ ఘడ్, మోరబీ, 8-10-54

గంగాస్వరూపురాలైన తఖత్ కుమారీబా (కృష్ణకుమారీబా)కు:-

మీ పత్రమందినది. చదివి సంతసించడమైనది. అహంగ్రహ ధ్యానము అనగా నేమియో మీకు బోధపడనట్లు వ్రాసినారు. ఈ విషయములో ప్రణవమే (పరమాత్మ) బ్రహ్మము అను భావముతో మున్ముందు ప్రణవోపాసనమును చేయండి. భావన దృఢీభూతమై పరిపక్వమగుటతోడనే "నేనే బ్రహ్మము" అను భావములోకి క్రమేణ రావలెను. ఓంకారముద్వారా ప్రథమమున బ్రహ్మమును ప్రతీక ధ్యానముచేసి పరిపక్వావస్థకు రావడంతోనే అహంగ్రహ ధ్యానములోనికి రావీలగును. ప్రతీకధ్యానము పరిపక్వమయినతర్వాత, ప్రణవమే బ్రహ్మము, అదే నేను అనునట్టి అహంగ్రహము అనగా అభేద ధ్యానము అగును,

ఇట్లు

మీ అన్న, ప్రకాశానంద్.

## స్వామీజీ ఉత్తరము—2.

హర్షభవనము, రాజకోట్, 7-9-56


గంగాస్వరూపిణి తఖద్ కుమారీబా (కృష్ణకుమారీబా) కు:—

మీ ఉత్తరము అందినది. చదివి సంతసించడమైనది. మీ ఆరోగ్యము సరిగా లేనట్లు తెలియుచున్నది. ఔషధసేవతోపాటు ఆత్మజపమును కూడా క్రమముగా కూర్చుకొనినచో త్వరలో ఆరోగ్యము చేకూరును. "నాకు రోగము ఏమియును లేదు. రోగము ఎవరికి ఉండును? నేను సాక్షి, కూటస్థ, ఆనందస్వరూపము. అట్టి నాయందు రోగము ఉండ వీలు లేదు"—ఇట్టి భావనతో ఔషధసేవ చేయునది.

మీకు బెంగలేముండును! నావలెనే ఉన్నారు.

ఇట్లు:—మీ బాపు (తండ్రి) ప్రకాశానంద,

# శ్రీ ప్రకాశానందస్వామివారి జాతకచక్రము.




స్వస్తిశ్రీ శాలివాహన శకాబ్దాః 1742 (విక్రమశకాబ్దాః 1924 క్రీస్తుశకాబ్దాః 1871) మాఘబహుళ త్రయోదశీ (మహాశివరాత్రి) శుక్రవారమున (ది 17-2-1871 తేదీన) ఉత్తరాషాఢా నక్షత్రమునందు జననము.

## శ్రీ స్వామి ప్రకాశానందుల వారు



ఏతదాలంబనమ్ శ్రేష్ఠం
ఏ తదాలంబనమ్ పరం
ఏతదాలంబనమ్ జ్ఞాత్వా
బ్రహ్మలోకే మహీయతే ॥

# శ్రీ ప్రకాశానందస్వామి వారి
## జీవిత చరిత్ర సంగ్రహము.

ఈ వార్తాలాప గ్రంథమును చదివిన ప్రతివారును దానిని రచించిన శ్రీస్వామివారి జీవితవివరములను తెలిసికొన కుతూహలపడుట సహజము. వీరి పూర్వాశ్రమవృత్తాంతము అంతసమగ్రముగా తెలియరాలేదు. అయినను తెలిసినంతవరకు వారి జీవితవృత్తాంతము ఇట సంగ్రహింపబడినది.

### 1. జననాదివృత్తాంతము :

వీరు శాలివాహనశకము 1742 సం॥న మాఘబహుళ త్రయోదశీ శుక్రవారమున (ది17-2-1871 తేదీన) శివరాత్రిపుణ్యదినమున ఉదయము 7-30 గంటలకు జన్మించిరి. వీరి జాతకచక్రము ఇందు చివర పొందుపరచబడినది. వీరు ఆంధ్రదేశమున విశాఖపట్టణజిల్లాలో విజయనగరప్రాంతమున నొకానొక గ్రామములో జన్మించినట్లు తెలియుచున్నది. వీరు వెలనాటి బ్రాహ్మణులు. 'వీరి పేరు అనంతయ్య పంతులు. వీరి తండ్రి వెంకటాద్రియయ్య, తల్లి గవరమ్మ, సోదరి రామానుజమ్మ, పితామహుడు లక్ష్మీనరసింహము, పితామహి మీనాక్షమ్మ అని శ్రీస్వామివారివలననే తెలిసినవివరములు. తమ గ్రామముపేరును ఇంటిపేరునుకూడా చెప్పియుందురు. కాని శిష్యులెవరు వాటిని జ్ఞాపకముంచుకొనలేదు. ఇటుపైన ఆంధ్రసోదరులెవరైనా తగుదర్యాప్తుచేసి ఆవివరములను దెల్పుదురని ఆశించుచున్నాము. వీరిజన్మస్థలము తెలిసినతోడనే దానిని యాత్రాస్థానముగా రూపొందించవలెనని గుజరాత్-సౌరాష్ట్రలోని వారి శిష్యులు సంకల్పించియున్నారు.

## 2. బాల్యము :

వీరికి 8వ సం॥న పితృవియోగము 19వ సం॥న మాతృవియోగము సంభవించినవి. తాతగారే పోషకులై విద్యనుగరపినారు III ఫారము వరకుచదివి 15సం॥లప్రాయమునస్కూలుచదువుమానివేసికొంచెము సంస్కృతమును జ్యోతిషమును నేర్చుకొనిరి. తాత,నాయనమ్మగారలే వీరికి ఉపనయనసంస్కారముగావించిరి. వీరివివాహమునకుతగినకన్యను జూచితాంబూలములను పుచ్చుకొనుటజరిగినది. కానివిధివశమునవివాహముకాకపూర్వమే ఆకన్యక ఓవంగతురాలాయెను. ఈసంఘటనఅనంతయ్యపంతులును సంసారబంధమున చిక్కుకొనకుండా చేసినది. పితామహి వేరొకసంబంధమును జూచి వివాహముచేయ సంకల్పించగా అత్యంతవైముఖ్యముతో గృహపరిత్యాగమునకు వీరు సంకల్పించిరి. వీరికి చిన్నతనమున ఆంగ్లమును నేర్పినవారు దత్తయ్యపంతులుగారు. వారు గొప్పవేదాంతులు. అనంతయ్యగారి సంసారవైముఖ్యమును, ఆత్మజ్ఞానోపదేశకుల నన్వేషించుప్రయత్నమును గ్రహించి నీకు తగిన గురువు తనంతట తానే లభించు ననియు ఎచ్చటకు వెళ్లనక్కర లేదనియు ధైర్యము జెప్పిరి.

## 3. గృహత్యాగము :

వీరికి 16 సం॥లప్రాయము వచ్చినది. సైనికోద్యోగియగు ఒక సుబేదారుడు వీరికి ఆప్తమిత్రుడు. అతనిభార్య సౌందర్యవతియగు యువతి. ఆమె ప్రసవసమయమున చనిపోగా మిత్రునితోకూడా వీరు శ్మశానమునకు వెళ్లి ఆదహనక్రియనంతను గమనించెను. అందు ఆమె అవయవములు ఒక్కొక్కటి యెట్లు దగ్ధమగుచున్నవో అని గమనించుచుండగానే త్రుటికాలములో ఆసౌందర్యరాశి మాయమై పోయెను. వెంటనే వీరివైరాగ్యము ఒక్కసారిగా తీవ్రరూపమును దాల్చి గృహపరిత్యాగబుద్ధిని దృఢపరచెను. అనతికాలముననే పితామహాదిసంబంధమునువీడిగుర్వన్వేషణబుద్ధితో గృహపరిత్యాగముచేసిరి.

### 4. గురులాభనము :

వీరు క్రమముగా దేశాటనచేయుచు ది 14-1-1887 తేదీన బిల్లాముపట్టణము చేరుకొనిరి. అచ్చట డెప్యూటీకలెక్టరుగానున్న శ్రీలల్లూభాయిగోవర్ధనదాసుగారు గొప్ప వేదాంతపరిజ్ఞాతయనియు, ఉత్తమోపదేశకుడనియు తెలియరాగా వారిపరిచయమును క్రమముగా సంపాదింపగలిగిరి. ఆకలెక్టరుగారి జన్మస్థానము గుజరాతులోని సూరతు. వారు జాత్యా వైశ్యులయినను ఆచరణపరులై స్థితప్రజ్ఞకోటికి చెందినమహనీయులు. వారి సన్నిధానమున యోగవాసిష్ఠాదిగ్రంథములద్వారా వేదాంతశ్రవణముచేసికొంతకృతకృత్యతను సంపాదించిరి. క్రమముగా వీరికి సన్యాసాశ్రమస్వీకరణసంకల్పము దృఢమై పైకి వ్యక్తము కాజొచ్చెను. ఇదిచూచి గురుశ్రీలల్లూభాయిగారు అందలికష్టసుఖములను వివరించుచు వీరిని ఆసంకల్పమునుండి విరమింపజేయ ప్రయత్నించిరి. కాని ఫలితము లేకపోయెను. ఎన్ని కష్టములనైనను ఎదుర్కొని ఆయాశ్రమమును ఆదర్శప్రాయముగా నిర్వహించవలెననియే నిశ్చయించుకొనిరి. ముందుగా గురుశ్రీవారి యనుమతినెట్లో బడసి పెద్దతిరుపతిని చేరుకొనిరి. అచ్చట స్వామిపుష్కరిణీతీర్థములో స్నానముచేసి స్వయముగానే ప్రేషమంత్రోచ్చారణముచేసి శిఖాయజ్ఞోపవీతములను పరిత్యజించిరి. పిమ్మట మద్రాసు వెళ్ళి అచ్చట బుచ్చయ్యపంతులుగారివద్ద ఉపనిషత్తులను సభాష్యముగా నభ్యసించిరి. గడ్డముమీసములను పెంచుకొని కొంతకాలమున్న తర్వాత వాటినికూడా విసర్జించిరి.

మద్రాసునుండి నాసికకు, అచ్చటినుండి కాశీనకకు వారి ద్వారమునకు పయనమైరి. మార్గమధ్యమున శ్రీస్వామిఅనుభవానందులవారి పరిచయము లభించినది. వారు గొప్ప వైయాకరణులైన సంస్కృతపండితులు. వారికడ సిద్ధాంతకౌముదిని, వ్యాకరణమహా

భాష్యమును అభ్యసించిరి. ఆస్వామివారే వీరికి అన్వర్థముగు 'ప్రకాశానంద' అను నామధేయమును ప్రసాదించిరి.

పిమ్మట హృషీకేశమున శ్రీసుఖానందస్వామివారివద్ద నేతి, ధౌతి, బస్తి, ప్రాణాయామము మున్నగు హఠయోగప్రక్రియలను నేర్చుకొనిరి. హృషీకేశమునుండి గుజరాతులోని నడియాదుని చేరిరి. అచ్చట సంతరామ్‌గుడిలో నివసించియున్న శ్రీస్వామి జానకీదాసుగారివద్ద వృత్తిప్రభాకరాది ప్రమేయగ్రంథములందు చక్కనిపరిశ్రమ గావించిరి. అప్పట్లో మధుకరవృత్తితోనే జీవితమును గడపు నలవాటు నొందిరి. తరువాత రామానుజం అను గొప్ప పండితులసన్నిధిని మరి కొన్ని ప్రమేయగ్రంథముల నభ్యసించిరి.

శ్రీ ప్రకాశానందస్వామివారు ఆశ్రమస్వీకారానంతరము కూడ తమగురుశ్రీ లల్లూభాయిగారిని వారు ఉద్యోగరీత్యా ఎచ్చట నున్న అచ్చటికి వెళ్ళి కలియుచు తరుచు వారియుపదేశామృతముల గ్రోలుచుండెడివారు. వారున్ను వీరిని ఆశ్రమగౌరవమును పురస్కరించుకొని మిక్కిలి గౌరవాదరములతో చూచుచుండెడివారు. ఇట్లు గురుశ్రీవారితో 15 సం॥ములు గడపిరి. వారి నిర్యాణకాలమునకు శ్రీస్వామివారివయస్సు 32 సం॥లు మాత్రమే.

### ౬. సర్వస్వత్యాగము :

శ్రీస్వామివారు ఎన్నడును ధనమును సేకరించుట నెరుగరు. ఒక పైసనుకూడ చేతితో ముట్టనవసరములేకుండా కాలమును గడిపెవారు. ఆశ్రమమునుగాని గృహమునుగాని నిర్మింప నెవ్వరికిని నవకాశమియ్యలేదు. వారి శిష్యబృందములో పెక్కండ్రు శ్రీమంతులు, రాజులు, మహారాజులు మున్నగువారు వారి సద్బోధామృతమును గ్రోలుచుండెడివారు. అట్టివారు కలుగజేయు సౌకర్యములనుగాని, ఇయ్యబూనిన ధనమునుగాని తృణప్రాయముగా నిరాకరించెడివారు. వారు ధర్మార్థము సద్వినియోగము చేయగోరుచు నిచ్చిన ధనమును

కూడ స్పృశించెడివారుకాదు. వారి సదామహారాజావారు, మొరటీ మహారాజావారు శ్రీస్వామివారి సంతతసాన్నిధ్యమునుగోరి వారిస్థిర నివాసమునకు గృహమునుగాని, ఆశ్రమమునుగాని నిర్మింపబ్రయత్నింపగా, తాము జీవించియున్నంతకాలము ఈతలదాచుకొనుటకు చిన్న కుటీరముకూడ తమకక్కరలేదని చెప్పి వారిప్రయత్నములను విఫలముగావించిరి. శ్రీస్వామివారు ఎచ్చటికి వెళ్ళినను శ్మశానములోగాని, పాడుదేవాలయములోగాని, చెట్టుక్రిందగాని మకాముచేసి కాలక్షేపము చేయుచుండెడివారు.

## 6. ఆత్మసాక్షాత్కారము :

శ్రీస్వామివారికి 40 సం॥ల ప్రాయమున ఆత్మసాక్షాత్కారము లభించినట్లు సంతతసంబంధముగల వారిశిష్యులకు కానవచ్చినదట. ఆరోజులలో శ్రీస్వామివారు నల్లరంగుదుస్తులనే ధరించెడివారు. ఆ దుస్తులతోనుండగా తీయబడిన ఫొటో ఈగ్రంథమున వేరొకచోట ముద్రింపబడినది. అప్పట్లో శ్రీస్వామివారు కేవలము ఉన్మత్తునిమాదిరిగా తిరుగుచుండెడివారు. ఒకచిరిగిబొంత, ఒకమట్టిపిడత తప్ప మరియేఉపకరణమును దరిజేరనీయక సర్వసంగపరిత్యాగమనట్టిదో లోకమునకు ఋజువుచేసిరి. కావుననే వారికి 'గోదదియాస్వామి' (బొంతముంతస్వామి) అని వాడుక వచ్చినది.

## 7. త్రికాలజ్ఞాని :

శ్రీస్వామివారు త్రికాలజ్ఞాని అని శిష్యబృందము తమజీవిత ఘట్టములలో జరిగిన కొన్నిసంఘటనలుబట్టి విశ్వసించుచున్నది. వారి త్రికాలజ్ఞత కీక్రిందనొక ఉదాహరణము చూపబడుచున్నది.

భావనగర్ కాలేజీలోని ఒకసంస్కృతప్రొఫెసరు స్వామివారి ముఖ్యశిష్యులలో నొకరు. ఆయన జన్మస్థానము గుజరాత్ లోని నదియాదు. స్వామివారు ఒకప్పుడు భావనగరువచ్చి ఒకతోటలో

మకాముచేసియుండగా ఈప్రొఫెసరుగారు వెళ్ళి నమస్కరించి కూర్చుండెను. స్వామివారు ప్రొఫెసరువైపుజూచి నదియాదునుండి (మీయింటినుండి) ఏదైనా ఉత్తరము వచ్చినదా? అంతా కుశలమా? అని ప్రశ్నించిరట. ఉత్తరము రాలేదుగాని అంతా కుశలమే అని ప్రొఫెసరు పలికెనట. అంతట స్వామివారు రెండుమూడురోజులలో తాము నదియాదు వెళ్ళుచున్నాము, మీయింటికికూడా వెళ్ళగలము అని చెప్పి యూరకున్నారట. ప్రొఫెసరుగారికి వారెందుకట్లు ప్రశ్నించి వెళ్ళుతామనిరో బోధపడలేదు. స్వామివారు అన్నప్రకారము నదియాదులో వారింటికి వెళ్ళగా ప్రొఫెసరుగారి చంటిఅబ్బాయి 6మాసములవానికి మశూచికముసోకి బాధపడుచుండుటను గాంచిరి. ఆశిశువును పరిశీలించి ప్రొఫెసరుభార్యతో 'అమ్మాయీ! నేను డాకోరువెళ్ళి 3,4 రోజులలో తిరిగివస్తాను. పిల్లవానిని బాధపడకుండా జాగ్రత్తగా చూడుము. ఈశరీరము నశ్వరము. దానిపై మోహము చెందుట తగదుసుమా!' అని పలికిరి. అంతట ఆమె 'స్వామీజీ! మాఅబ్బాయికి తగని జబ్బువచ్చి బాధపడుచుండుటచే మేమంతా బెంగపెట్టుకుంటున్నాము. తామిట్టిపరిస్థితిలో అట్లు సెలవిచ్చుట భావ్యమా? అని యనగా "అమ్మాయీ! మాఅబ్బాయి, మాఅబ్బాయి అంటున్నావేమి? నేను తిరిగివచ్చినతర్వాత మీఅబ్బాయిని చూపించవమ్మా' అనిపలికి వెళ్ళిపోయిరట. వారు తిరిగివచ్చేసరికి ఆపిల్లవాడు గతించినట్లు తెలిసినది. ఇట్టి సంఘటనలు తమయనుభవములలో పెక్కుకలవని వారిశిష్యులు చెప్పుట కలదు.

౮. అవతారపురుషులు :

శ్రీస్వామివారు ఈశ్వరాంశసంభూతులు, అవతారపురుషులు అని శిష్యవర్గమువారి నమ్మకము. వారు తమయవసానకాలమున ద్వారకలో మకాముచేసియున్న భవనపు ఆవరణములో విశ్వనాథ విగ్రహము, నందివిగ్రహము ఉండెడివట. వాటిసమీపముననున్న

గదిలోనికి తమమకామును మార్చుకొని సంతతము ఆవిగ్రహముల
పైననే తమదృష్టిని కేంద్రీకరించుచు ప్రణవధ్యాననిమగ్నులై తమ
చివరిరోజులను గడపినట్లు శిష్యులు చెప్పుచున్నారు స్వామివారి
జీవితములో కొన్ని యద్భుతసన్నివేశములను తాము గాంచినట్లు
శిష్యులు చెప్పుట కలదు. కొందరికి శ్రీస్వామివారి ఫాలప్రదేశమున
ఓంకార దర్శనము లభించినదట. భావనగర్‌లోని సంస్కృతప్రొఫెసరు
గారు చాణోదగ్రామమున నర్మదాతీరమునందు మహాశివరాత్రినాడు
శ్రీస్వామివారి నచ్చట దర్శింపబోగా వారి లలాటమున త్రిశూలము
తమదృష్టికి గోచరమైనదని చెప్పిరి. శ్రీస్వామివారు ఏవో చమ
త్కారచర్యలు జరిపి శిష్యకోటిని ఆకర్షించాలనిగాని, పేరుప్రతిష్ఠలు
సంపాదించాలనిగాని తాపత్రయము పడినట్లు వారిజీవితప్రవృత్తిలో
లేశమైనను అవకాశ మెప్పుడును గాంచబడలేదు. కాని అప్పుడప్పుడు
శిష్యులందు అపారకరుణావేశపరవశులై వారియాధివ్యాధుల నుపశ
మింపజేయుచు వారికి ఐహికాముష్మికశ్రేయోసుగుణములగు నుప
దేశములను ప్రసాదించుచుండెడివారు.

## 9. దయాస్వరూపులు :

సర్వప్రాణులయందును దయను వర్షించుచు సర్వభూతసమత్వ
మును వెల్లడించుచుండెడివారు ప్రజలకు సామాజికముగాగాని, ఆర్థి
ముగాగాని ఏవైన అన్యాయములు జరిగినట్లు తెలిసినచో చాలాబాధ
పడుచుండెడివారు. వాటిని నిరసించుచు సర్వసమత్వమును ఉద్బో
ధించుచుండెడివారు తమశిష్యవర్గములో ధనికవర్గమునకు చెందిన
వారిని అన్యాయముగాగాని, అవసరమునకుమించిగాని ధనార్జన చేయ
రాదని మందలించుచుండెడివారు. ధనమునంతయు ఒకేచోట కేంద్రీ
కరింపజేసి అపారధనసంచయమునకు పాల్పడినవారిని లోకకంటకు
లైన అసురులని పేర్కొనుచుండెడివారు. ప్రతివారును స్వార్థమును
వెనుకకునెట్టి సంఘశ్రేయమునకే పాటుపడవలసినదిగా హితోప
దేశము చేయుచుండెడివారు. రాజులకు, మహారాజులకు పన్నుల

నధికముగా వేసి ప్రజలను పీడించరాదనియు ప్రజాక్షేమములోనే తమ క్షేమ మిమిడియున్నదనియు బోధించుచుండెడివారు. శ్రీస్వామివారి దయాశీలత్వమును తెలిసికొనుటకు క్రిందిసంఘటన చాలును.

శ్రీస్వామివారియందపారభక్తిగల శిష్యులలో మోరబీమహారాజావారొకరు. వారి కొకప్పుడు తీవ్రమైన జబ్బుచేసి జీవితదశను గోల్పోయిన పరిస్థితి యేర్పడినది. మహారాజావారు శ్రీస్వామివా సాన్నిధ్యమున తమజీవితమును చాలించుకోవాలని తలచి శ్రీవారి దర్శనము గోరుచు మిక్కిలిప్రార్థించుచు నుత్తరము వ్రాయగా వెంటనే శ్రీస్వామివారు విచ్చేసిరి. అచ్చటనే 6 మాసములుండిరి. మహారాజావారు క్రమముగా కోల్కొని పూర్ణస్వాస్థ్యమును చెందిరి. శ్రీస్వామివారి సాన్నిధ్యమే తాము జీవించుటకు కారణమని నమ్మిరి. శ్రీస్వామివారు తమయందు జూపిన యపారకరుణకు పరమానందభరితులై వారి చరణసన్నిధిని లక్షరూపాయిలు పోగుపోసి తమచిత్తానుసారము ధర్మకార్యములకై వినియోగింపుడని శ్రీస్వామివారిని ప్రార్థించిరి. వారు ఆధనరాశిని స్పృశింపకపోవుటయేగాక కండ్లతో చూడనైన చూడలేదు. ఆసంవత్సరము పంటలుపోయి కరవుచే పన్నులు కట్టలేక రైతువర్గము బాధపడుచున్నట్లు తెలిసియుండుటచే తమద్వారా ఆధనమును సద్వినియోగము చేయుటకంటె రైతుల పన్నుల భారమును తగ్గించుచు నుత్తర్వులను జారీచేయుట సర్వథా శ్రేయస్కరమని హితవొసంగిరి. వెంటనే మహారాజావారు శ్రీవారి యాజ్ఞను శిరసావహించి ఆసంవత్సరము పన్నులవలన రావలసిన 20 లక్షలరూపాయిల రాబడి వదలుకొనుచు పన్నుల నియ్యనక్కరలేదని ఉత్తర్వులను జారీచేసిరి.

10. వినోదప్రియులు :

శ్రీస్వామివారికి చిన్నపిల్లలమీద ప్రీతిమెండు. వారిని చేరదీసి వినోదకరమైన సంభాషణలతో ప్రీతిని గొల్పుచుండెడివారు

వీరు కాన్పించగనే 'దాదా, దాదా' అనుచు పిల్లలందరు వీరివద్దకు చేరుచుండెడివారు. ఆపిల్లలతో సంభాషించునప్పుడు పరిహాసములను, వేళాకోళములను, చమత్కారములను వినియోగించుచు వారితోకలసి ఆనందించెడివారు. శిష్యులు తమవద్దకువచ్చి ఉపదేశములను గోరుచున్నప్పుడుకూడ మధ్యమధ్యన పరిహాసవాక్యములను, వేళాకోళములను చేయుచు వింతకథలను చెప్పుచు వినోదపరచుచుండెడివారు.

## 11. మతాంతరవిజ్ఞానము:—

వీరు వాస్తవమునకు శ్రీశంకరులవారి అద్వైతమునే సర్వాత్మనా అనుసరించుటను అభిలషించినవారైనను, ద్వైతవిశిష్టాద్వైతాదులయందు ఎట్టి ఏవగింపులేక అన్నిమతములకు గమ్యస్థాన మొకటియనియు, దానిని చేరుమార్గములు భిన్నములనియు చెప్పి సర్వమతసామరస్యమును బోధించియుండిరి. బౌద్ధాదిమతగ్రంథములందు, బైబిలు, ఖురాను ఇత్యాది వైదేశికమతగ్రంథములందును శ్రీస్వామివారికి విశిష్టపరిచయమున్నట్లు వాటినుండి ఇందు ఉదహరించబడిన గ్రంథభాగములనుబట్టి తెలియుచున్నది. తాము ప్రతిపాదించిన విషయమును సమర్థించుటకే ఆగ్రంథభాగములను ఉదహరించినందున శ్రీస్వామివారు ఆమతములయం దెట్టిద్వేషములేక పూజ్యభావమునే కలిగియుండిరనుట సువ్యక్తము.

శ్రీస్వామివారు 'అవకాశము లభించినపుడెల్ల చిన్నపెద్దయని యెంచక సంతులందరితోను వేదాంతగోష్ఠి జరిపి యనేకవిషయములను గ్రహించెడివారు. దేశాటన, సాధుసజ్జనసంగమాదులవలన అపారలోకజ్ఞానమునుకూడ సంపాదించుకొనిరి. వీరిగౌరవాదరములకు పాత్రులైన సంతులలో 1. అహమ్మదాబాద్‌లోనిసరయూదాసుగారు 2. కచ్ఛనివాసులగు నారాయణదాసుగారు 3. చరోతరునందలి జానకీదాసుగారు, 4. పీరడియాలోని నిత్యానందస్వామివారు ముఖ్యులు. వారిలోకూడ శ్రీనిత్యానందస్వామివారిపట్ల వీరికిగల భక్తిగౌరవాదరములు ప్రమాణాతీతములు.

ఈ వార్తాలాపమును రచించినది శ్రీప్రకాశానందస్వామివారే అయినను, తమకును శ్రీనిత్యానందస్వామివారికిని మధ్య శిష్యబృంద సమక్షమున జరిగిన సంభాషణలే ఇందు సేకరింపబడినట్లుచెప్పనగును. ఈగ్రంథము 'ధర్మాలాపము' అను పేరుతో మొదట వెలువడెను. కాని ధర్మోపదేశమునకు తాము అర్హులము కాము అనిచెప్పి ఆపేరునుమార్చి 'వార్తాలాపము' అని పేరుపెట్టిరి. ఇయ్యది వారినిగర్వతకు, నిర్డంభతకు ప్రబల నిదర్శనము. శ్రీస్వామివారిచే రచింపబడిన గ్రంథములలో ఈవార్తాలాపమే హైందవప్రజానీకమునకును, తత్రాపి ముముక్షుజనమునకున్ను సంసారతరణోపాయమైన ఉత్తమోత్తమగ్రంథమని చెప్పదగును. మిక్కిలిసులభము, సరళమునగు శైలిలో సర్వసుబోధముగా కథలు, దృష్టాంతములు మున్నగువాని ద్వారా అనేకక్లిష్టవిషయములు నిరూపింపబడినవి. ప్రతివ్యక్తియు ఆత్మపరీక్షచేసికొని తరించుటకు తగుమార్గము లిందు చూపబడినవి. శ్రీస్వామివారు హిందీగుజరాతీమిశ్రమభాషలో చెప్పుచుండగా భాషాద్వయపరిజ్ఞాతలైన ధీమంతులైన శిష్యులచే వ్రాయబడి తిరిగి స్వామివారిచే పరిశోధింపబడి వారిపర్యవేక్షణక్రిందనే గుజరాతీ భాషలో నియ్యది ముద్రింపబడినది ప్రతీముద్రణమునకును పూర్వము స్వామివారిచే తిరిగి పరిశీలింపబడి తగుమార్పులతో ముద్రింపబడుచుండెను. ఈ తెలుగు వార్తాలాపమునకు మాతృకగా గ్రహింపబడిన 8వముద్రణముకూడా శ్రీస్వామివారిచేతనే సవరింపబడి నవముద్రణమునకు సిద్ధముచేయబడియున్నది. ఇందు శ్రుతులు, స్మృతులు, ఉపనిషత్తులు, పురాణేతిహాసములు, మహాకావ్యములు మున్నగు 101 గ్రంథములనుండి ప్రమాణవాక్యములు పరిగ్రహింపబడినవి. శ్రీస్వామివారి ప్రత్యేకాభిమానపాత్రములై, శిష్యులను చదువవలసినదిగా వారిచే పేర్కొనబడినగ్రంథరాజములలో 1. పంచీకరణము, 2. విచారసాగరము, 3. పంచదశి, 4. తత్త్వానుసంధానము, 5. వృత్తిప్రభాకరము అనునవి ముఖ్యములు.

**14. ఇతర సాహిత్యము:—**

ఈవార్తాలాపమే కాక శ్రీస్వామివారు గుజరాతీభాషలో రచించిన 1. సంతుగురుపరిచయము, 2. ఆపణోధర్మము (మనధర్మము) 3. ధర్మజ్యోతి, 4. సప్తశ్లోకీగీత మున్నగునవి ముద్రితములైయున్నవి. శ్రీస్వామివారిది అముద్రితసాహిత్యము శిష్యులకు తమకు మధ్య నడచిన ఉత్తరప్రత్యుత్తరములరూపమున మిక్కుటముగా నున్నది. అట్టిలేఖలలో శిరోహిరాజమాతకు (ఈ తెలుగువార్తాలాపముద్రణాది వ్యయమునంతను భరించిన యామెకు) శ్రీస్వామీజీవారు వ్రాసిన రెండులేఖలను మచ్చునకు ఈగ్రంథారంభమున ప్రచురించడమైనది.

శ్రీస్వామివారు తరుచుగా ఏకాంతమున గూర్చొని ధ్యానగోచరములగు విషయములను గుజరాతీభాషలోగాని, తెలుగుభాషలోగాని తెలుగులిపిలోనే నోటుచేస్తూ ఉండేవారు. అట్టిసాహిత్యము కూడా అపారముగా నున్నది. శ్రీస్వామివారి చివరిరోజులలో వారి శిష్యులు ఈసాహిత్యమునంతను జూచి "స్వామీజీ! ఇదంతయు తెలుగులిపిలో నున్నదే మేమేమి చేయవలెనో యాదేశింపుడు" అని ప్రార్థించిరి. "ఆంధ్రదేశమునుండి తగినవ్యక్తియొకరు వచ్చి దీనినంతను తర్జుమాచేసి మీకందుబాటులో పెట్టును. మీరందుకై బెంగ పడవలదు" అని స్వామివారు సమాధానపరచిరి. అందుకనుగుణముగా శ్రీస్వామివారు సిద్ధిపొందిన కొలదిమాసములలో గుజరాత్‌లోని ఒక సద్గృహస్థుడు రాజమండ్రిలో నివసించుచున్న గుజరాత్ దేశస్థులైన శ్రీ జి. ఆర్. త్రివేదీగార్కి ఒకఉత్తరము వ్రాసిరి. అందులో వారు హిందీసంస్కృతములలో పరిజ్ఞానముగల ఒకఆంధ్రుని సౌరాష్ట్రములో శ్రీస్వామివారు సిద్ధిచెందిన ద్వారకాపట్టణమునకంపి శ్రీస్వామివారిచే తెలుగులిపిలో నోటుచేయబడిన సాహిత్యమునంతను హిందీలోకి తర్జుమాచేయించుటకు వలయు ఏర్పాట్లను గావింపవలసినదిగా శ్రీ త్రివేదీగారిని కోరిరి. వెంటనే వారు హిందీలో M A ప్యాసయి సంస్కృతపరిచయముగల ఒక B, ED పండితుని పంపిరి. ఆపండిట్ దాంరకలో 4 మాసములుండి ఆసాహిత్యమును హిందీలోకి తర్జుమా

చేసిరి. దానిని తిరిగి గుజరాతీలోనికి తర్జుమా చేయించి ప్రకటించుటకు తగుప్రయత్నములు గావింపబడుచున్నవి.

15. వార్తాలాపము-ఆంధ్రానువాదము :

ఆపండిట్ గారే ద్వారకలో తాము నివసించిన యత్యల్పకాలములో గుజరాతీభాషను నేర్చుకొని బహుపరిశ్రమచేసి గుజరాతీలోని వార్తాలాపమును ఎట్టిప్రతిఫలము లేకయే తెలుగులోనికి అనువదించిరి. ఆపండిట్ గారి కోరికప్రకారము వారిపేరు నిందు బేర్కొనవీలు లేకపోయినందుకు విచారించుచున్నాము.

ఈయాంధ్రానువాదగ్రంధమును,ముద్రణాదివ్యయమునంతను తామే భరించి, తెలుగు ప్రజానీకమున కందజేయవలెనను అత్యుదారాశయముతో శిరోహి రాజమాత గం॥ భా॥ Her Highness కృష్ణకుమారిబా (తఖత్ కుమారిబా) అనగా ప్రస్తుతము జామ్‌నగరు మహారాణీగానున్న శ్రీమతి Her Highness కుమారీబాకు తల్లిగారు శ్రీ జి. ఆర్. త్రివేదీగారినే తెలుగులో ముద్రింపజేయుటకు వలయు ఏర్పాట్లను గావింపవలసినదిగా కోరియుండిరి. శ్రీత్రివేదీగారు తమ యింటిప్రక్కనేయున్న శ్రీవాసా అన్నప్పశాస్త్రిగారున్నూ కలిసి గుజరాతీలోని వార్తాలాపముతో ఆంధ్రానువాదమును ఒకసంవత్సరముపాటు ప్రతిరోజున రాత్రివేళ 1, 2 గంటలు కూర్చొని ఉక్తానుక్తదురుక్తచింతానుపూర్వకముగా ప్రత్యక్షరము పరిశీలించి తగుసవరణలు,మార్పులుగావించి సాధ్యమైనంతమట్టుకు నిర్దుష్టముగావించి ముద్రణమున కందించడమైనది. కావున శ్రీస్వామివారి పర్యవేక్షణక్రింద గుజరాతీలో ముద్రితమైన వార్తాలాపమునకు ఇయ్యది విశ్వసనీయమైన ఆంధ్రానువాదముగా పరిగ్రహింపనగును.

16. శ్రీస్వామివారి మహాప్రయాణము-విదేహముక్తి :

వెనుక శ్రీస్వామివారి త్రికాలజ్ఞాని యని చెప్పబడియున్నది. కనుక వారికి తమ సిద్ధికాలము ఆసన్నమైనదను సంగతి ముందుగా తెలిసియుండెను. తాము ద్వారకలోనే సిద్ధిపొందవలెనని మొదటి

నుండి వారు సంకల్పించియుండిరి. అందుచే తమసిద్ధికాలము ఆసన్న మైనట్లు నిర్ణయించుకొని ది 15-1-1962 తేదిన జామ్‌నగరునుండిద్వార కకు వచ్చివేసిరి. అప్పటికి వారివయస్సు రమారమి 91 సం॥లు ద్వారకలో శ్రీతులసీదాస్ హరిదాస్‌గారి భవనములో వారినివాస మేర్పరుపబడెను. ఆభవనము ఆవరణలో చిన్నవిశ్వనాధదేవాలయ ముండెను. దానికి 10 అడుగుల దూరములో ఒకచిన్నగదియుండెను. దానిలోనికి తమమకామును వెంటనే మార్చుకొనిరి. వారి దినచర్య, స్వాస్థ్యము యథాపూర్వముగానే ఉండెను. తామిదివరలో వ్రాసి యుంచిన సాహిత్యమునంతను పునఃపరిశీలనగావించుచుండిరి. వచ్చిన ఉత్తరములకు, జిజ్ఞాసువులకు తగుసమాధానము లిచ్చుచుండిరి. ఆహారవిహారాదులుకూడ యథాపూర్వముగానే నడచుచుండెను. అందుచే శ్రీస్వామివారింతత్వరలో సిద్ధిపొందుతారని యెవరునూహించ లేకపోయిరి. కాని వారి ప్రవృత్తిలోను, మాటలలోను కొన్నిసూచ నలు కానవచ్చినవి.

ఇక 9రోజులకు సిద్ధిపొందుతారనగా తమకు ఆతిథ్యమునిచ్చిన గృహస్థుని ఇంటిలోని ఒక చంటిపిల్లవానిని తీసికొనివచ్చి శ్రీస్వామి వారి పాదసన్నిధి నుంచిరి. వారు ఈపిల్లవానివైపుచూచి "నాపేరును ఈపిల్లవానికిచ్చుచున్నాను, నాపేరును తారుమారుచేసి 'ఆనందప్రకాశ్' అని ఈపిల్లవానికి పేరుపెట్టండి. ఇటుపైన ఆపేరుతో నాకే మియు నవసరములేదు. ఇది అఖండనామకరణము" అని నుడివిరట. ఆరోజు గురువారము. తరువాతి సోమవారమునాడు తులసీదాస్‌గారి సోదరి మధురిబెన్‌తో తనకు జేగురుతీసికొనిరమ్మ బట్టలకు రంగు వేసి కాషాయవస్త్రములను ధరించుట నాకిప్పుడు అవసరము అని చెప్పిరట. ఆమె రంగునుతెచ్చి బీరువాలో పెట్టియుంచెనేగాని వెంటనే ఇయ్యలేదు. ఈసందర్భమున ప్రౌఢవయస్కురాలైన మధురబెన్ గూర్చి రెండుమాటలు చెప్పుట అప్రస్తుతము కాదు. ఆమెగొప్ప ధని

కునియింటబుట్టి వివాహమైన కొలదిదినములలోనే వైధవ్యమునకు గురియై నాటినుండి శ్రీస్వామివారి పాదసేవా నిరతురాలై వేదాంత శాస్త్రాభ్యాసముతోబాటు సాధనలోమంచియభివృద్ధిని సంపాదించెను. శ్రీస్వామివారున్ను అతివాత్సల్యముతో నామెకు ధ్యానాదులలో శిక్షణాభ్యాసములను ప్రత్యేకముగా గరపిరి. ఆమె శ్రీస్వాములవారికి భోజనాదిసౌకర్యములను సమగ్రముగా మెలకువతో సమకూర్చుచుండెడిది. ఒక్కమాటలో చెప్పవలెనన్న ఆమె శ్రీస్వామివారిని తప్ప మరొకదైవము నెరుగదనిన చాలును. ఆమెతండ్రి హరిదాస్ గారిని పిలచి నేను 'శరీరత్యాగముచేసినచో నామృతకళేబరమును ఈసముద్రములో పారవేయుడు' అని ఆదేశించిరి. కాని వారి బాహ్యవైఖరిచూడగా వారింతలో సిద్ధిపొందుతారని ఎవ్వరికిని తట్టలేదు. తరువాతిఆదివారమున శ్రీస్వామివారికిఅస్వస్థత ప్రవేశించినది. కాని స్వస్థతవలెనే కాన్పించిరి. వారికి ఆరోజు టీత్రాగేవేళలో ఒక పెద్దవమన మయినది. వెంటనే డాక్టరువచ్చి పరీక్షించినారు. హృదయము చాలదుర్బలముగానున్నది. 24గంటలు దాటుటకూడ కష్టమని చెప్పిరి. వెంటనే తంత్రీవార్తలు ఆయాతావుల కంపబడినవి. చాలమంది శిష్యులు వెంటనే వచ్చిరి. కాని వారందరికి ఆశ్చర్యమును గొల్పుచు మిక్కిలి స్వస్థతతో నున్నట్లుగానే కాన్పించిరి. కావున కొందరు ఇంతలో తొందరలేదనిచెప్పి యింటికిపోయిరి. తరువాతి గురువారమునాడు రాత్రి అస్వస్థత పైకి బాగా స్ఫుటమైనది. జ్ఞాపకశక్తితగ్గి ఇది ద్వారకయేనా అని పలుమారుప్రశ్నించిరి. శుక్రవారము ప్రాతఃకాలమున తిరిగి బాగుగానున్నట్లు కాన్పించిరి. ఇడ్లీ సాంబారు టిఫిను తీసికొనిరి. మధ్యాహ్నము 12గంటల ప్రాంతమున బహిర్దేశమునకు వెళ్లివచ్చిరి. దగ్గరనున్న వారినిజూచి స్వామివారు నవ్విరి. వారుకూడా నవ్విరి. వెంటనే చిటిక వేసి 'చలో' (పోదాము) అనిపలికిరి. అప్పుడు 12-20ని॥ల కాలము. ఆదేసమములో శ్రీద్వారకాపురీశునిగుడిలో కోటిరూపాయిలు విలువగల శ్రీకృష్ణపరమాత్మునికిరీ

టను కుండలములు హఠాత్తుగాజారి క్రిందపడిపోయెను. ఎన్నడునెరుగని యిట్టిదుస్సంఘటనవల్ల నేమిముప్పువచ్చునోయని అర్చకబృందము హడలెత్తిపోయెను. అదేసమయమున అనగా 12-20 గంటలకు 'చలో' అని ప్రాణములనువిడచుచు ప్రక్కనేఉన్న మనుభాయిదీక్షిత్, దుర్గాశంకర్ రావల్ అనువారి ఇద్దరిహస్తములలోను తమశరీరమును జారవిడచిరి. 'చలో' అనునది తమవద్దకు వచ్చిన దేవదూతలకు ఇచ్చిన ఆజ్ఞవలె కాన్పించినది. అన్నిప్రాంతములకు తిరిగితంత్రీవార్తలుఇయ్యబడినవి. బొంబాయి మున్నగు దూరప్రాంతములనుండికూడా వందలకొలది శిష్యులు, విమానములు, రైళ్ళు, మోటారుకార్లుద్వారా సకాలములో ద్వారక చేరుకొనిరి. పిమ్మట 24గంటలవరకు శ్రీస్వామివారి మృతకళేబరము సచేతనముగా నున్నట్లే కాన్పించెను. బ్రహ్మీభూతులైన మరుచటిదినమున ప్రేతసంస్కారములనన్నిటిని ఆశ్రమానుగుణముగా యథావిధిగ జరిపిరి పాలకీలో కళేబరమునుంచి శాంతిప్రసాద్‌జీమహంతు, స్వామిహరిహరాశ్రమ, పూజ్యప్రేమభిక్షుక్‌జీ మున్నగు మహనీయులు మోయుచు నగరప్రదక్షిణము గావించిరి. ఆకళేబరమును నావలోపెట్టి గోమతీసంగమస్థానమునుండి సముద్రములోనికి తీసికొనివెళ్ళి విసర్జించిరి. శ్రీస్వామివారు జామ్‌నగరునుండి ద్వారకకు వచ్చిన 40వ దినమున అనగా ప్లవసం॥ర మాఘ బ॥ చతుర్థీ శుక్రవారమున ది 23-2-1962 తేదీన బ్రహ్మీభూతులైరి.

## 17. శ్రీస్వామివారి యాత్మమహిమ :

శ్రీస్వామివారి భౌతికదేహము అనిత్యమైనను వారిమహిమ ఇప్పటికిని అచంచలమై ప్రత్యక్షమగుచున్నది. వారు సిద్ధిచెందినగదిలోని వారివస్తువులను, పరికరములను అదేవిధముగా భద్రపరచి మధురిబెక్‌చే నిత్యము దీపారాధన, హారతి మున్నగుసపర్యలు జరుపబడుచుండెను. ఆగది శిష్యబృందమునకు యాత్రాస్థానముగా నేటికిని వెలయుచున్నది. అనేకమంది శిష్యులు శ్రీస్వామివారి ఆత్మప్రభావ

మును తమలో అనుభవించుచున్నారు. ఈసందర్భమున ఈఉదాహరణ గమనింపదగినది.

మధురిబెన్‌తండ్రి హరిదాసుగారి వయస్సు 76 సం॥లు. కొన్ని సంవత్సరములకు పూర్వము రాచకురుపునకు (కేన్సరునకు) వారికిఆపరేషనుచేసిరి. హరిదాస్‌గారికి మాత్రము ఆఆపరేషనువల్లజీవిస్తామనే ఆశ కలుగలేదు, కాని స్వామివారు అప్పట్లో బ్రతుకుతావని హామీ యివ్వగా ఆపరేషనుపిమ్మట చాలకాలము జీవించిరి. కాని ఇటీవల కొన్నిమాసములకు పూర్వము ఆహరిదాస్‌గారికి కంఠములో ఏదో అవరోధమేర్పడి నీరుకూడా లోపలికి వెళ్లకుండెను. వెంటనే 25మైళ్ళ దూరములోనున్న "ఓఖా" ఆసుపత్రిలో వారిని చేర్చిరి. అచ్చటి డాక్టరుగారు బొంబాయిలోని తాతా కేన్సరు ఆసుపత్రికి తీసుకొని వెళ్ళమని సలహాయివ్వగా బొంబాయిప్రయాణమునకు సిద్ధముకాదలచి ద్వారక చేరుకొనిరి. అప్పుడు మధురిబెన్ గ్లాసుతో నీటిని శ్రీస్వామివారి సమాధిస్థానమునబెట్టి ప్రార్థించి ఆనీటిని తండ్రిగారికిచ్చెను. ఆనీరు త్రాగుటతోనే అవరోధముతొలగి త్వరలోనే నీరంతా త్రాగివేసెను. భోజనమునుకూడా యథాపూర్వముగా చేయగలిగెను. అయినను బొంబాయివెళ్ళి కేన్సరుఆసుపత్రిలో తణిఖీచేయించిరి. డాక్టర్లు ఎట్టిదోషము లేదని చెప్పిరి శ్రీస్వామివారి యాత్మప్రభావమెట్టిదో దీనివలన తెలియనగును.

## 18. ఉపసంహారము :—

శ్రీస్వామివారిజీవితచరిత్రము గుజరాతీలో ప్రత్యేకగ్రంథముల రూపమున అతివిస్తృతముగానున్నది. ఇటదానిసంగ్రహముమాత్రమే చూపబడినది. తెలుగులో ఇంకొకముద్రణము పడేభాగ్యము లభించినచో ఇంతకన్న విపులీకరించి వ్రాయప్రయత్నించెదము.

ఓమ్ శ్రీప్రకాశాయ నమః

# సమర్పణము.




ఏ సదురుని కృపాకటాక్షముచే నాజీవితము ప్రకాశవంత
మయ్యెనో ఆమహనీయ సద్గురు చరణారవిందము
లందు భక్తిశ్రద్ధాదర పురస్సరముగా
ఈ వార్తాలాపము (ఆంధ్రానువాదము)
సమర్పితము.

ఇట్లు,
కృష్ణ కుంవర్ బా.
(రాజమాత-శిరోహి, రాజస్థాన్)



శ్రీ స్వామివారు ఆత్మసాక్షాత్కారమైనతర్వాత ఉన్మత్తదశలో

( వయస్సు - 40 సం॥ )



ధ్యానవిషయంలో – శ్రీ స్వామివారు స్వహస్తముతో వ్రాసిన వ్యాసములోని భాగము.

౬౦

[illegible]

चि. वालीडिकिरि. भानुमती-तारा.
बन्ने पत्र. मळ्युं. अति. आनंद. थयुं
छे. अने-वारंवार-तुं-याद-आवे छे
अने-हुं-घणुं-करीने-अठ
वाडिया-पछी-जामनगर-आव
वानो छुं- चि- अनंत प्रसाद-आदि
सर्वने- नारायण स्मरण-

लि- तारा बापु.

ॐ

(प्रकाश)

---

శ్రీస్వామివారు 1942 సం॥లో నాగరిలిపిలో గుజరాతీభాషలో వ్రాసిన ఏకైక ఉత్తరం.



అవధూత అవస్థలో [ వయస్సు - 46 సం॥ ]



మహానిర్యాణమునకు 9 రోజులు ముందర [వయస్సు 92 సం॥]